# రిఫ్లెక్షన్

వీధి వరండా మీద వాలు కుర్చీలో కూర్చుని న్యూస్‌పేపర్ తిరగేస్తున్న నారాయణమూర్తిగారు ఎవరో చిన్నపిల్లాడు ఏడ్పు వినిపించి రోడ్డుకేసి చూసారు.

ఏడేళ్ల కుర్రాడు. జారిపోతున్న నిక్కర్ని పైకెగ లాక్కుంటూ కొంప కాలి పోయినప్పుడు పెద్దవాళ్లేడ్చినట్టుగా బిగ్గరగా ఏడ్చుకుంటూ వెళ్తున్నాడు. కళ్ళు నులుముకుంటూ ముక్కొమ్మట కారుతున్న చీమిడ్ని ఎగబీల్చుకుంటూ పీకోసిన గొడ్డులా ఏడ్చుకుంటూ వెళ్తున్నాడు.

"అమ్మో, అయ్యో ఎందుకో తన్నుంటారు పాపం!" అనుకున్నారు. నారాయణమూర్తిగారు. ఎందుకోగాని సరదాగా వాడితో కాసేపు కాలక్షేపం చెయ్యాలనిపించింది. గబగబా లేచి వెళ్లి మెట్ల మీద నిలబడి, "ఒరేయ్ అబ్బాయ్! ఒకసారిలా రా!" అంటూ చప్పట్లు కొట్టి పిలిచారు.

వాడు వినిపించుకోలేదు.

"నిన్నేరా అబ్బాయ్!" అన్నారు నారాయణమూర్తిగారు.

ఆగి ... ఒక్క క్షణం ఏడుపు ఆపి ... 'నన్నా?' అన్నట్టుగా చూశాడు వాడు. "నిన్నే! ఇట్రా!"

వాడు భయం భయంగా దగ్గరికొచ్చాడు.

"ఎందుకురా ఏడుస్తున్నావ్? ఎవరు కొట్టారు?"

"ఎవరు కొడితే మీకెందుకండీ? వాడితో ఏవిటి మీకు?" అప్పుడే అక్కడికొచ్చిన కనకమ్మ వెనకనించి అంది. ఆవిడ చేతిలో పొగలు గ్రక్కుతున్న కాఫీ కప్పు.

"ఊరికే ... పాపం ఎందుకేడుస్తున్నాడో కనుక్కుందావని" అంటూ ఆవిడ చేతిలోంచి కప్పందుకున్నారు నారాయణమూర్తిగారు.

"నన్నుండమంటారా, వెళ్లమంటారా?" అన్నట్టుగా చూశాడు కుర్రాడు.

"చెప్పవేంరా? ఎందుకేడుస్తున్నావ్? ఎవరన్నా కొట్టారా?"

"ఆఁ వాళ్లమ్మ కొట్టింది ... ఏం మీరెళ్లి ఆవిణ్ణి కొట్టి వీడికి న్యాయం చేకూరుస్తారా?" నవ్వుతూ అంది కనకమ్మ.

"అబ్బ నువ్వుండవే" అని విసుక్కుని "నువ్ చెప్పరా" అన్నారు నారాయణమూర్తిగారు.

కుర్రాడు కళ్ళు తుడుచుకుంటూ, "మరేమోనండీ, ఇడ్డెన్లు తీస్కెళ్తుంటే పొట్లం కుక్కెత్తుకు పోయిందండీ" అన్నాడు చేతులు అదోలా తిప్పుతూ.

"ఇడ్డెన్లా ... ఎవరికీ తీసుకెళుతున్నావ్?"

"మా అయ్యకండీ".

"ఏడిస్తే పోయిన ఇడ్డెన్లు తిరిగి రావుగా! ఇంటికెళ్లి కుక్కెత్తుకు పోయిందని చెప్పు మీ నాన్నతో. మళ్లీ డబ్బులిస్తాడు. మళ్లీ తీస్కెళుదువుగాని" పళ్ల బిగువున నవ్వాపుకుంటూ ఉచిత సలహా పారేశారు నారాయణమూర్తిగారు. ఆసీన్‌లో వాణ్ణి చూస్తే ఎవరికైనానవ్వే వస్తుంది మరి!

"ఓరి తెలివి తక్కువ సన్నాసీ!" అన్నట్టుగా చూశాడా కుర్రాడు.

"ఇయ్యడండి. కుక్కకెందుకు పెట్టేవని తంతాడండి."

"నేను పెట్టలేదు. అదే లాక్కు పోయిందని చెప్పు."

"అయినా తంతాడండి."

"మరైతే ఏం చేస్తావ్?"

కర్తవ్యం స్ఫురించినవాడిలా చటుక్కున మళ్లీ రాగాలాపన ప్రారంభించేశాడు వాడు.

"ఊరుకోరా బాబూ!" అన్నారు నారాయణమూర్తిగారు.

వాడు ఊరుకోలేదు సరికదా, రాగాలాపన స్థాయిని ద్విగుణీకృతం చేశాడు.

"ఊరుకోరా చిట్టి తండ్రీ! రూపాయిస్తాలే గాని, ఇడ్డెన్లు మళ్లీ కొనుక్కెళ్ళువుగాని, ఏడవబాక ఊరుకో" అని భార్య వైపు తిరిగి - "లోపలికెళ్లి ఒక రూపాయి తీసుకురా కనకం" అన్నారు నారాయణమూర్తిగారు.

"మీకు తిక్కా, చాదస్తమా?" అన్నట్టుగా చూసి లోపలికెళ్లిందావిడ.

ఏడుపెక్కడికెగిరిపోయిందో గాని, ఆల్చిప్పల్లాంటి కళ్లని చక్రాల్లా తిప్పుతూ, "ఇదంతా కలా, నిజమా?" అన్నట్టు సంభ్రమంగా చూస్తున్నాడు కుర్రాడు. ఆ మధ్య కాళ్లరిగేటట్టు తిరగ్గా తిరగ్గా మూడో కూతురికి సంబంధం ఖాయమైనపుడు నారాయణమూర్తిగారు ఎంత రిలీఫ్‌గా ఫీలయ్యారో - ఇపుడు వీడు కూడా అంతే రిలీఫ్‌గా ఫీలవుతున్నాడు.

"మీ నాన్నేం చేస్తాడ్రా?"

"రిచ్చా తోల్తాడండి. మరేమోనండి. రోజూ తాగొచ్చి మా అమ్మని తంతుంటాడండి! బియ్యం లేవని రాత్రి మా అమ్మ వొంట సెయ్యలేదు కదండీ; పాపం ఆకలేసి పోయుంటాదండీ ::: అందుకే ఇడ్డెన్లు తెప్పించు కుంటున్నాడండి!" భయం తొలగినందువల్ల కాబోలు, ఒకటడిగితే ఉత్సాహంగా నాలుగు చెప్పాడు వాడు.

"ఐతేపాపం నువ్వు కూడా రాత్రి అన్నం తినలేదా?"

"తిన్లేదండి. నాక్కూడా ఆకలేసి పోతాందండి. కానుండీ, ఇడ్డెన్లు తీస్కెళ్లినా మా అయ్యనాకు పెట్టడండీ. ఆడొక్కడే తినేస్తాడండి."

"ఎన్నిడ్డెన్లు తీస్కెళ్తున్నావ్?"

"నాలుగండి. రూపాయండి ..."

"ఇంకో రూపాయి కూడా ఇస్తాన్లేగాని నువ్ కూడా నాలుగిడ్డెన్లు తినెళ్ళు" అన్నారు నారాయణమూర్తి' గారు జాలిగా.

అంతలో "మీ చొక్కా జేబులో అన్నీ రెండు కాగితాలే ఉన్నాయ్. రూపాయి నోట్లు లేవు" అంటూ వచ్చింది కనకమ్మ. దాంతో ఆయనే స్వయంగా లోపలికెళ్లి రెండ్రూపాయలు తెచ్చి వాడి చేతిలో పెట్టారు.

కాగితం చేతిలో పడటం ఆలస్యం కేరింతలు కొడుతూ పరుగుతీశాడు వాడు.

"దారే పోయేవాణ్ణి కెలకడమెందుకు, డబ్బులొదిలించుకోవడ మెందుకు? ఇంతకీ ఏం చెప్పాడు వాడు కథ?" వెటకారంగా అడిగింది కనకమ్మ.

"పోతే పోనిద్దూ రెండ్రూపాయలేగా" అని చప్పరించేశారు నారాయణమూర్తిగారు.


"ఎవరి పిచ్చి వారి కానందం" అని లోలోనఇంకా ఏదో గొణుక్కుంటూ లోపలికి వెళ్లిపోయింది కనకమ్మ.

తిరిగి వాలు కుర్చీ నాశ్రయించిన నారాయణమూర్తిగారు ఇంకా వాడి గురించే ఆలోచించసాగారు.

పాపం వాళ్ల నాన్న తంతాడని బెగిలిపోయుంటాడు కుర్రాడు.

తను గనుక డబ్బులివ్వకపోతే ఈపాటికి ఇంటికెళ్లి తండ్రితో తన్నులు తింటూ ఉండేవాడే పాపం!

అదేంటో గాని ఈ శ్రమజీవులంతా అంతే!సంపాదనంతా తాగుడు క్రింద ఖర్చు పెట్టేసి



పెళ్లాం పిల్లల్ని బొత్తిగా పట్టించుకోరు. రాత్రి వాడు కనీసం అయిదు రూపాయలన్నా తాగుండడా? గ్యారంటీగా తాగుంటాడు. ఆ అయిదు రూపాయలే గనక ఇంట్లో ఇచ్చుంటే ఇంటిల్లిపాదికీ భోజనం గడుస్తుంది కదా? ఆ ఇంగితం ఉండదు. వాడనేకాదు. దాదాపు ఈ అలగా జనం అంతా అంతే! వాళ్లైతే రూపాయలకొద్దీ తాగొచ్చుగాని, కొడుకు పొరపాటున ఒక్క రూపాయి ఇడ్లీలు పోగొడితే మాత్రం తప్ప ఊరుకోలేడు చావ బాత్తాడు ఇదివరకూడా ఎప్పుడో ఇలా జరిగే ఉంటుంది. ఆ అనుభవం గుర్తుండబట్టే ఆ కుర్ర వెధవంతగా జడిసిపోయాడు పాపం!

నాన్నా!' అన్న శ్రీనివాసరావు పిలుపు నారాయణమూర్తి గారి ఆలోచనలకి అంతరాయం కలిగించింది ఏమిటన్నట్టుగా చూసారు కొడుకు వైపు

శ్రీనివాసరావు నారాయణమూర్తి గారి చిన్న కొడుకు ఇంటర్ సెకండియర్ చదువుతున్నాడు వయసు పదిహేడు.

"ఏంలేదులే నాన్నా" అంటూ లోపలికి వెళ్ళిపోయాడు శ్రీనివాసరావు

"ఏం లేదంటూ లోపలికొచ్చేస్తే ఎలాగనుకున్నావ్? ఎప్పటికైనా చెప్పక తప్పేది కాదుగా? చెప్పు.... చేసుకొచ్చిన ఘనకార్యం' లోపల్నుంచి కనకమ్మ కంఠం.

"ఏవిట్రా, ఏమైంది?" అనుమానంగా చూశారు నారాయణమూర్తిగారు.

శ్రీనివాసరావ్ తల దించుకున్నాడు

"ఇప్పుడు భయపడి చస్తే ఏం లాభం? ఆ భయమేదో ముందే ఉండాల్సింది" అంది కనకమ్మ గుమ్మం దగ్గరికొస్తూ.

నారాయణమూర్తి గారికి సంగతేమిటో అర్థంకాలేదు

"ఏమిటి కనకం? ఏమైంది? ఏంటి వీడిలా నసుగుతున్నాడు?"

"వాడ్నే అడగండి."

శ్రీనివాసరావు తల్లికేసి చురుగ్గా చూసి మళ్లీ అంతలోనే తల దించుకున్నాడు

కొడుకు వల్ల ఏదో పొరపాటు జరిగిందని మాత్రం అర్థమైంది నారాయణమూర్తి గారికి. ఏం జరిగుంటుందబ్బా? అనుకుంటూ భార్య కేసి కొడుక్కేసి మార్చి మార్చి చూశారు.

కనకమ్మ గడప దాటి ఇవతలికి వచ్చింది.

"నిన్న మీరు వాడికి టెర్మ్ ఫీజ్ కట్టమని డబ్బిచ్చారుగా..."

నారాయణమూర్తి గారి గుండె గుభిల్లుమంది.

"ఆఁ ఇచ్చాను. నూట డెభ్భై. ఏం కట్ట లేదటనా?"

"లేదు. డబ్బు పోయిందట. సిటీ బస్‌లో ఎవడో జేబు కొట్టేశాడట! మీరలా వెళ్లగానే ఏడ్చుకుంటూ ఇంటికొచ్చేశాడు! ఒకటి కాదు రెండు కాదు, నూట డెభ్భై రూపాయలు! ఎవడి మొహాన దొబ్బెట్టాడో. ఏమో!'

"నిజమేనా శ్రీనూ?" అంటూ ఎర్రబడ్డ కళ్లతో కొడుక్కేసి చూశారు నారాయణమూర్తిగారు.

అతనింకా తల దించుకునే ఉన్నాడు. అతని కళ్లలో కంపనని గమనించి ఏదో అనబోయిన వాడల్లా ఆగిపోయారు నారాయణమూర్తిగారు. క్షణం తర్వాత "మరి నాతో ఇంతవరకూ చెప్పలేదేం?" అన్నారు భార్య నుద్దేశించి

"రాత్రి బాగా పొద్దు పోయి వచ్చారుగా; అర్ధరాత్రప్పుడెందుకులే చెప్పడం అని ఊరుకున్నాను. పొద్దున్నే పేపరు ముందేసుక్కూర్చున్నారుగా!"

నిజమే. రాత్రి బాగా పొద్దు పోయాకే వచ్చారు నారాయణమూర్తి గారు. పదకొండున్నర వరకూ క్లబ్బులో పేకాట. పన్నెండు దాటుతుండగా ఇల్లు చేరారు. అసలే పేకాటలో డబ్బు పోగొట్టుకుని వచ్చారేమో ఆ సంగతి గనక రాత్రే తెలిసుంటే వెర్రి కోపంతో చిందులేసేవారే!

వెర్రి కోపం కాకపోయినా ఇప్పుడూ కోపమే వచ్చింది నారాయణమూర్తిగారిక అయినా నిగ్రహించుకుంటూ కొడుక్కేసి మరోమారు తేరిపార చూశారు.

ఇంకా అలాగే ఉన్నాడు శ్రీనివాసరావు. ఇంకా వొణుకుతూనే ఉన్నాడు

నారాయణమూర్తి గారి మనసులో అప్రయత్నంగా ఇందాకటి కుర్రకుంక మెదిలాడు. ఆయన మనసు కాస్త ముందుకు జరిగి, కొద్ది నిముషాలు క్రితపు తన ఆలోచనలను ఓ మారు స్పర్శించి ::: ఒక్క నిముషం అటూ ఇటూ ఊగిసలాడింది. ఆయన దృష్టి మళ్లీ కొడుకు మీద నిలిచింది.

"ఎందుకురా అలా భయపడిపోతావ్? ఎవడో జేబు కొట్టేస్తే నువ్ మాత్రం ఏం చేస్తావ్! బాధపడకు డబ్బులు మళ్లీ ఇస్తాను. ఈ రోజు కట్టేద్దువుగాన్లే' అన్నారు ఆప్యాయంగా.

సంగతి తెలిసి ఎంత రభస చేస్తారో అని భయపడుతూ ఉన్న కనకమ్మకి భర్త ఆ విషయాన్ని అంత తేలిగ్గా తీసుకోవటం ఎంతో ఆశ్చర్యంగా అనిపించింది. విస్ఫారిత నేత్రాలతో చూసింది నారాయణమూర్తి గారి దిక్కు.

శ్రీనివాసరావు భయపడుతూనే నెమ్మదిగా తల పైకెత్తి, తండ్రి తనకేసే చూస్తుండటంతో అంతలోనే మళ్లీ కళ్లు దించుకున్నాడు.

"డోంట్ వర్రీ టేకిట్ ఈజీ" అంటూ వేచి వెళ్లి అతని భుజం మీద చిన్నగా తట్టారు నారాయణమూర్తిగారు



'హమ్మయ్య" అనుకుంటూ నిండుగా ఊపిరి పీల్చాడు శ్రీనివాసరావ్

కనకమ్మ ఇంకా ఆశ్చర్యంగానే చూస్తూ ఉంది. □